క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలసిన ఏజీపీ



ఎమ్మెల్యే పెద్దారెడ్డిని సన్మానిస్తున్న ఏజీపీ భాస్కర్‌రెడ్డి, న్యాయవాదులు

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా నియమితులైన ఎన్వీ భాస్కర్‌రెడ్డి ఆదివారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వరుసాగా నాలుగోసారి తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యేను ఆయనతోపాటు న్యాయవాదులు రమణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా ఏజీపీ మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేస్తానన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

యల్లనూరు: ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గిరిబాబు హెచ్చరించారు. యల్లనూరు, తిరుమలాపురం, నిట్టూరు, మేడికుర్తి, తిమ్మంపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. పల్లెల్లో గ్రూపు రాజకీయాలు, తగాదాలు ఉంటే స్టేషన్‌కు వచ్చి సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. చిన్నపాటి సమస్యలను పెద్దవి చేస్తే సహించేది లేదన్నారు.

అనంతపురం వెళ్లి పింఛన్ పంపిణీ



అనంతపురంలోని ఆస్పత్రిలో వృద్ధుడు హంపిరెడ్డికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

పెద్దవడుగూరు: మండలంలోని కండ్లగూడూరు గ్రామానికి చెందిన వృద్ధుడు హంపిరెడ్డి అనారోగ్యంతో అనంతపురంలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ లక్ష్మీనారాయణ అనంతపురం వెళ్లి అతడి యోగక్షేమాలు తెలుసుకుని పింఛన్ అందజేశాడు. దీంతో వృద్ధుడి కుటుంబ సభ్యుల వలంటీర్‌ను అభినందించడంతో పాటు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడు వెంకటరమణను సన్మానిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని మర్తాడు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న వెంకటరమణను డ్రీమ్ ఆర్ట్ అకాడమీ విశ్వవిద్యాలయం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆదివారం సన్మాన గ్రహీత మాట్లాడుతూ శనివారం గుంటూరు జిల్లా వడ్డేశ్వరలో కమల్ విశ్వవిద్యాలయం, అనంత్ డైమండ్ కేఎల్ విశ్వవిద్యాల యం సంయుక్తంగా చిత్రకళా ప్రదర్శన, చిత్రకళ కార్యశాల నిర్వహించారన్నారు. అలాగే చిత్రకళా చరిత్ర, చిత్రకళ గ్రంథాల ప్రచురణకు విశ్వవిద్యాలయం వారు సన్మానించారన్నారు.

నేడు 'ఆసరా' సంబరాలు

గుత్తి: పట్టణంలోని ఎంఎస్ ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో సోమవారం 'వైఎస్సార్ ఆసరా' నాలుగో విడత సంబరాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, ఎంపీపీ విశాలాక్షి, టీఎంసీ కెరన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు గుంతకల్లు ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. మహిళా సంఘాల సభ్యులతో పాటు ప్రజా ప్రతినిధులు, ప్రజలు తరలి రావాలని వారు కోరారు.

ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ కవిత

పెద్దపప్పూరు: మండలకేంద్రంలోని ధర్మాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో ఇటీవల జగనన్న కాలనీలో ప్రభుత్వం ఇంటిపట్టాలను పంపిణీ చేసింది. ఆ ఇంటి స్థలాలకు సంబంధించి ఆదివారం 93 మందికి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కవిత, ఎంపీపీ వెంకటరామిరెడ్డి, ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథ రెడ్డి, జిల్లా పార్లమెంట్ జనరల్ సెకట్రరీ రవిప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమర్ నాథ రెడ్డి, నామనాంకపల్లి రఘునాథ రెడ్డి, జనార్దన్ రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్క.. జీవితానికి రక్ష

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సోమ, మంగళ వారం ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తామని వైద్య సిబ్బంది తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. పోలియో రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యమని గుంతకల్లు, తాడిపత్రి ఎమ్మెల్యేలు వై.వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు.

- చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యేలు వైవీఆర్, కేతిరెడ్డి పెద్దారెడ్డి





గుంతకల్లులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, గుత్తిలో పల్స్ పోలియో కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ భ్రమరాంబ దేవి



తాడిపత్రి రోటరీక్లబ్‌లో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

గుంతకల్లుటౌన్: రెండు పోలియో చుక్కలే నిండు జీవితాన్ని నిలబెడతాయి. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు అందరూ పాటుపడాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని తిలక్‌నగర్‌లో ఉన్న డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వైవీఆర్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పట్టణంలోని వార్డు సచివాలయాలు, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్, ప్రధాన కూడళ్లతో కలిపి మొత్తం 49 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారులు స్వాతి, అరుణ, హరిత, సజీవ్, రఘునందన్, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. 28వ వార్డు సచివాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

తాడిపత్రి అర్బన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కేంద్రంలో ఆదివారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి వికలత్వం నుంచి కాపాడాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యుడు శ్రీనివాసరెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. కాగా పట్టణ వ్యాప్తంగా మొత్తం 40 కేంద్రాలు ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేశారు.

తాడిపత్రిటౌన్: మండలంలోని అన్ని గ్రామాల్లో దాదాపు 97.10 శాతం పోలియో చుక్కల కార్యక్రమం పూర్తి చేసినట్లు వైద్యులు తెలిపారు. మండల వ్యాప్తంగా దాదాపు 5,970 మంది చిన్నారులుండగా 5,954 మందికి పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, సీనియర్ మెడికల్ అధికారి శ్రీనివాసరెడ్డి, ప్రోగ్రాం అధికారి నారాయణస్వామి, సూపర్‌వైజర్‌లు క్రిష్ణమోహన్ బాబు, బాలనరసింహులు, హేమలత, నాగరత్న, ఎంపీ నారాయణ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: మండలంలో ఆదివారం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం 98 శాతం నమోదైనట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్‌కుమార్ బాబు తెలిపారు. మండల వ్యాప్తంగా 6,512 మంది ఐదేళ్లలోపు చిన్నారులుండగా 6,429 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. మిగిలిన 83 మంది చిన్నారులకు 4,5 తేదీల్లో ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేస్తామన్నారు.

గుత్తి: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్ బీ ప్రారంభించారు. పల్స్ పోలియో కేంద్రాలను డీఎం అండ్ హెచ్ఓ భ్రమరాంబదేవి, డీపీఎంఓ రవి పరిశీలించారు. గుత్తి మున్సిపాలిటీ పరిధిలో 29 పోలియో కేంద్రాలు, రూరల్‌లో 44 పోలియో కేంద్రాలను ఏర్పాటు చే శారు. కార్యక్రమంలో గుత్తి పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, బేతాపల్లి పీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో 48 కేంద్రాల ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్. శంకర్‌నాయక్ అన్నారు. ఆదివారం శింగనమల వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో పల్స్ పోలియో కార్యక్రమం ఆయన ప్రారంభించారు. మండలంలో 5514 మందికి గాను 5275 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని ఎంపీపీ వెంకటనారాయణ ప్రారంభించారు. మండలంలో 45 కేంద్రాలతో పాటు గార్లదిన్నె బస్టాండ్ రైల్వేస్టేషన్‌లో వైద్య సిబ్బంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు గౌతమి, మంజుల, దిలీప్‌కుమార్, పద్మా వతి, సీహెచ్ఓ లోక్‌నాథ్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు: యల్లనూరు, తిమ్మంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. గొడ్డుమర్రిలో జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, వెన్నపూసపల్లిలో జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి, బుక్కాపురంలో ఎంపీపీ గంగాదేవి, మేడికుర్తిలో సచివాలయాల మండల కన్వీనర్, సర్పంచు ప్రభాకర్‌రెడ్డి, తిరుమలాపురంలో సర్పంచు రామాంజులురెడ్డి, వేములపల్లిలో సర్పంచు అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. కార్యక్రమంలో యల్లనూరు వైద్యులు లోకేష్‌కుమార్, శివసాయి, తిమ్మంపల్లి వైద్యురాలు కీర్తన, సీహెఓ మధు, సూపర్‌వైజర్లు రాము, హాజీవలి పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న పంచాయతీ కార్యాలయంలో ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల నల్లలమ్మ పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభించారు. పెద్దవడుగూరు ఆసుపత్రి పరిధిలో ఉన్న 2,652 మందికిగానూ 2,594 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు., క్రిష్టిపాడు పరిధిలో 1,505 మందికిగానూ 1,482 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశామని వైద్యులు శ్రీనివాసబాబు, శ్రీనివాసరెడ్డి తెలిపారు.

పుట్లూరు: మండలవ్యాప్తంగా ఆదివారం 98శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు అందించినట్లు డాక్టర్ శ్రీవాణి తెలిపారు. 2,410 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 2,360 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు.

పామిడి: మండలవ్యాప్తంగా 97 శాతం పల్సపోలియో నిర్వహించారు. ఎద్దులపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు సుధాకర్ ఆధ్వర్యంలో పల్స్‌పోలియో విజయవంతమైంది. మండలవ్యాప్తంగా 6,174 మందికి గానూ మొదటిరోజు 5,966 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



గార్లదిన్నెలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ వెంకటనారాయణ



యల్లనూరు మండలం బుక్కాపురంలో పోలియో చుక్కలు చేస్తున్న ఎంపీపీ గంగాదేవి



పెద్దవడుగూరులో పోలియో చుక్కలు వేస్తున్న ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల నల్లలమ్మ



గుంతకల్లులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని



గుత్తిలో పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ

మరోసారి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి



బేతాపల్లిలో పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



తారు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుత్తి: 'నియోజకవర్గంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేశాం. మరోసారి సీఎంగా వైఎస్ జగన్ అయ్యేవిధంగా అందరూ ఆశీర్వదించాలి' అని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. గుత్తి మండలం బేతాపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. మొదట చెట్నేపల్లి నుంచి బేతాపల్లి వరకు రూ. 63 లక్షలతో నిర్మించిన తారు రోడ్డును ప్రారంభోత్సవం చేశారు. అనంతరం బేతాపల్లిలో సుమారు రూ. 2 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, రూ. 40 లక్షలతో నిర్మించిన కల్వర్ట్(బ్రిడ్జి)ను ప్రారంభించారు. అలాగే గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సీఎం వైఎస్ జగన్ ముందుకెళ్తున్నారన్నారు. ముఖ్యంగా విద్యా, వైద్య రంగాల్లో అనూహ్య మార్పులు తీసుకొచ్చారన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉన్నారన్నారు. సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఓర్వలేక పోతున్నారన్నారు. మరోసారి సీఎంగా వైఎస్ జగన్ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విశాలాక్షి, సీనియర్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, బేతాపల్లి సర్పంచు చిన్న ఆంజనేయులు, ఆర్అండ్‌బీ ఈఈ ప్రసాద్‌రెడ్డి, డీఈ శ్రీధర్ రెడ్డి, ఏఈ నరసింహులు, కాంట్రాక్టర్ హరి, డీపీఎంఓ రవి, వైద్యులు ప్రవీణ్ కమార్, విష్ణుమూర్తి, ఎల్లారాయుడు, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ భారతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్ రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లయ్యయాదవ్, బీసీ సెల్ జిల్లా నాయకులు బేడల వెంకటరాముడు, సచివాలయ కన్వీనర్ సుభాష్‌రెడ్డి, నాయకులు రామ రంగారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలకు విలేజ్ క్లినిక్‌లలో అవకాశమివ్వాలి

గుంతకల్లుటౌన్: ఆర్ఎంపీ (రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్), పీఎంపీ(ప్రైమరీ మెడికల్ ప్రొవైడర్)లకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు సర్టిఫికెట్లు ఇచ్చి వైఎస్సార్ అర్బన్, విలేజ్ క్లినిక్‌లలో ఉద్యోగవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం నాయకులు కోరారు. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం గౌరవ అధ్యక్షులు ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు ఎస్ ఎండీ జాఫర్, ఉపాధ్యక్షులు హరి, నాగరాజు, కార్యదర్శి ఖాదర్‌వలి తదితరులు ఎమ్మెల్యేను కలిసారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

పామిడి: పట్టణంలోని వాసవీ కల్యాణ మంటపంలో ఆదివారం పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శిబిరంలో కంటి వైద్య నిపుణులు వనిత, షారుఖ్ 132 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 95 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు , క్లబ్ ఉపాధ్యక్షుడు పీసే జయరాంరావు, కోశాధికారి షెక్షావలి, ప్రధాన కార్యదర్శి రఘువీర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు రోషన్ జమీర్, శివ, సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగి అర్చకుడిగా చెలామణి!

బుక్కరాయసముద్రం: అతనొక ప్రభుత్వ ఉద్యోగి. పిల్లలకు చదువులు చెప్పే ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ దేవాలయంలో కూడా అర్చకుడిగా చెలామణి అవుతున్నాడు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన విజయ భాస్కర్ పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే బీకేఎస్ మండల కేంద్రంలో కొండమీదరాయుడి దేవాలయం, లక్ష్మీనారాయణ స్వామి దేవాలయాల్లో అర్చకుడిగా చెలామణి అవుతున్నాడని పలువురు అర్చకులు విమర్శిస్తున్నారు. 2023 ఆగస్టులో విజయభాస్కర్‌ను దేవదాయ శాఖ, కొండమీదరాయుడి స్వామి కమిటీ సభ్యులు అర్చకుడిగా తొలగించారు. అయితే ఇటీవల బండారు శ్రావణికి టిక్కెట్ రావడంతో శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకుని బీకేఎస్‌లోని కొండమీదరాయుని ఆలయానికి ర్యాలీలో వచ్చారు. దీంతో విజయ భాస్కర్ తాను ప్రభుత్వ ఉద్యోగి అయి మరిచి అర్చకుడి అవతారం ఎత్తి టీడీపీ నాయకులకు స్వాగతం పలకడంపై మిగతా అర్చకులు విమర్శిస్తున్నారు. ఈ ఆలయాల్లో అర్చకులు ఉన్నా.. వారికి ఏమాత్రం లెక్క చేయడకుండా తానే అర్చకుడిగా చెప్పుకుంటూ చెలామణి అవుతున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విజయభాస్కర్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని పలువురు అర్చకులు కోరారు.



బండారు శ్రావణి పూజా కార్యక్రమాల్లో ఉపాధ్యాయుడు విజయభాస్కర్ (ఫైల్)

మూగజీవాలను తరలిస్తున్న లారీ పట్టివేత

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని పత్తికొండ రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం రాత్రి ఓ లారీలో అక్రమంగా ఎద్దులు, ఆవులను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల రాకను పసిగట్టిన మూగ జీవాల అక్రమ తరలింపుదారులు పరారరయ్యారు. పోలీసులు లారీని, అందులో ఉన్న సుమారు 25 మూగ జీవాలను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

18 నుంచి 'పది' పరీక్షలు

యల్లనూరు: ఈ నెల 18 నుంచి పదో పరీక్షలు జరుగుతున్నట్లు ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. 30వ తేదీ పరీక్షలు ముగుస్తాయన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. 18న తెలుగు, 19న హిందీ, 20న ఇంగ్లిష్, 22న గణితం, 23న ఫిజికల్ సైన్సు, 26న బయాలజీ సైన్సు, 28న సంస్కృతం, అరబిక్, పర్షియన్, 30న ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్, 30న ఎస్సెస్సీ ఒకేషనల్ థియరీ పరీక్ష ఉంటుందన్నారు.

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమానికి ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు హాజరు అవుతున్నారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు హాజరు కావాలన్నారు.

నేడు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

యాడికి: నవరత్నాల పథకంలో భాగంగా ఇచ్చిన ఇళ్ల స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేతుల మీదుగా పేదలకు అందజేస్తున్నట్లు ఎంపీపీ బొంబాయి ఉమాదేవి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి నాయకులు హాజరు కావాలని ఆమె కోరారు.

ఓం నమో.. అశ్వత్థనారాయణాయ



స్వామి దర్శనం కోసం క్యూ లైన్‌లో భక్తులు



పిల్లనగోవి అలంకరణలో అశ్వత్థ నారాయణస్వామి



అలంకరణలో మూలవిరాట్



చక్ర భీమలింగేశ్వరుడు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో నాలుగో ఆదివారం తిరుణాల కనుల పండువగా నిర్వహించారు. స్వామిని దర్శించుకోవడానికి ఏపీ నుంచే గాక తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు స్నానాలు ఆచరించి నారాయణ స్వామి చక్రభీమలింగేశ్వరుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కోర్కెలు నెరవేరిన భక్తులు ముడుపులు, కానుకలతో పాటు తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అసౌకర్యాలకు గురికాకుండా ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాస రెడ్డి, ఈఓ సుబ్రమణ్యం ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ట్రైనీ డీఎస్పీ హేమంత్ కుమార్, సీఐ రోషన్, ఎస్ఐ శరత్ చంద్ర పర్యవేక్షించారు. దూర ప్రాంతాలనుంచి క్షేత్రానికి విచ్చేసే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపింది. పలువురు భక్తులు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

బైక్ బోల్తా.. ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని కర్నూలు రోడ్డులో మోడల్ స్కూల్ వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వ్యాపిలికి చెందిన రాజారాం బైక్‌లో గుత్తికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి బైక్‌లో వ్యాపిలికి బయలు దేరాడు. మోడల్ స్కూల్ వద్ద కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి బైక్ బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన అతడిని స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

డ్రైవర్‌కు..

గుత్తి: 44వ జాతీయ రహదారిపై వన్నేదొడి సమీపంలో ఆదివారం ముందు వెళుతున్న లారీని మరో లారీ వెనుక నుంచి బలంగా ఢీ కొంది. గాయపడిన హర్యానా లారీ డ్రైవర్ రుక్మన్ 108లో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.